రోడ్డుకు మరమ్మతులు ఎప్పుడో?

- ఆరేళ్లలో రెండుసార్లు తెగిన సీసీ రోడ్డు
- శాశ్వత పరిష్కారం చూపని అధికారులు
- వానాకాలంలో ఇబ్బంది పడుతున్న రైతులు


తెగిపోయిన సీసీ రోడ్డు


తాటిదుంగపై నుంచి వెళ్తున్న యువకుడు

దంతాలపల్లి: మండలం బొడ్లాడ గ్రామంలో రెండు సార్లు వర్షాలకు తెగిపోయిన సీసీ రోడ్డుకు శాశ్వత పరిష్కారం ఎప్పుడో అని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామంలో గల కొండలమ్మగుట్టకు మిషన్ భగీరథ వాటర్ సంపు ఏర్పాటు చేసి ఆ సంపు ద్వారా నాలుగు మండలాలకు నీళ్లు అందిస్తుంది. వాటర్ సంపు వద్దకు వెళ్లేందుకు వీలుగా గ్రామానికి చెందిన రైతుల వద్ద నుంచి వ్యవసాయ భూములను కొంత మేరకు కొనుగోలు చేసి సుమారు కిలో మీటరుకు పైగా సీసీ రోడ్డు నిర్మించారు. ఆ రోడ్డుకు రెండు వైపుల పొలాలతో పాటు గ్రామానికి చెందిన కొండలమ్మ చెరువు ఉంది. గత వర్షాకాలంలో వచ్చిన అతి భారీ వర్షాలకు రెండు చోట్ల తెగిపోవడమే కాకుండా మరోచోట రోడ్డు కింద మట్టికొట్టుకుపోయి ప్రమాదంగా మారింది. గ్రామానికి చెందిన సుమారు 40శాతం రైతులు రోడ్డు ద్వారా వ్యవసాయం పనులకు వెళ్తారు. సెప్టెంబర్, అక్టోబర్ నెలలో ప్రభుత్వం అత్యవసర నిధుల్లో భాగంగా మరమ్మతుకు రూ.5లక్షల నిధులు మంజూరు చేసింది. కొన్ని కారణాలతో పనులు ఆగిపోయాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. అధికారులు స్పందించి రోడ్డుకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..

సీసీ రోడ్డు తెగిపోవడంతో దహన సంస్కారాలకు వైకుంఠధామనికి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డుపై నిత్యం ప్రజలు అనేక పనులకు వెళ్తుంటారు. రోడ్డు రెండు చోట్ల తెగిపోవడంతో వెళ్లాలంటే తాటి దుంగలే ఆధారం అయ్యాయి.

\- ఉపేందర్, బొడ్లాడ

పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న డాక్టర్ యమున

గూడూరు: రాబోయే వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని అయోధ్యపురం పీహెచ్‌సీ వైద్యురాలు యమున అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సీజనల్ వ్యాధుల నిర్మూలనకు టాస్క్‌ఫోర్స్ సమావేశం ఎంపీడీఓ వీరస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో మురుగు నీటి గుంతలు లేకుండా చర్యలు చేపట్టాలని, పాడుబడిన బావులు పూడ్చించాలని, దోమల నివారణకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యుడు రాంబాబు, ఎంపీఓ సత్యనారాయణ, హెంసీహెచ్ మెడికల్ ఆఫీసర్ షెరాజ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం


బయ్యారం: అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

బయ్యారం: సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో ఏఐసీసీ , టీపీసీసీ కమిటీలు సామాజిక న్యాయం పాటించి ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు మంత్రివర్గంలో చోటు కల్పించడాన్ని హర్షిస్తూ సోమవారం బయ్యారంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మూలమధూకర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మూసలయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ సంబురాలు

కురవి: మండల కేంద్రంలోని గుడిసెంటర్ వద్ద, సీరోలు మండలం తాళ్లసంకీసలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌ను డిప్యూటీ స్పీకర్‌గా నియమించడంపై సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ కోఆర్డినేటర్ బండి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రంగౌడ్, ఆలయ చైర్మన్ కొర్ను రవీందర్‌రెడ్డి, ఎర్ర నాగేశ్వర్‌రావు భిక్షమయ్య, ప్రతాపని పుల్లయ్య, ఇనుగుర్తి సుగుణ, దేవయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ పరిధిలో జిల్లా వ్యాప్తంగా బీసీ హాస్టల్లో 2025-26 విద్యా సంవత్సరానికి మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఎం.నరసింహారావు సోమవారం తెలిపారు. కళాశాలలకు సంబంధించిన హాస్టల్‌లో కూడా సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఇంటర్ నుంచి పీజీ చదివే విద్యార్థులకు అవకాశం కలదన్నారు. సంబంధిత వెబ్ సైట్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న హాస్టల్‌లో 717సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈనెల 30న చివరి తేదీ అని, పూర్తి వివరాలకు అందుబాటులో ఉన్న బీసీ సంక్షేమ హాస్టల్స్‌ను సంప్రదించవచ్చన్నారు. 2025-25 విద్యా సంవత్సరానికి ప్రభుత్వం పాఠశాలలో ఎయిడెడ్ పాఠశాలలో 9, 10 తరగతిలో చదువుతున్న బీసీ విద్యార్థులకు ఉపకార వేతనాలు మంజూరు చేయుటకు ఈపాస్ వెబ్ సైట్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని పూర్తి వివరాలకు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెంకన్న



నెహ్రూసెంటర్: తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం(బీకేఎంయూ) జిల్లా ప్రధాన కార్యదర్శిగా జిల్లా కేంద్రానికి చెందిన చింతకుంట్ల వెంకన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఇటీవల తొర్రూరులో జరిగిన సంఘం జిల్లా మహాసభల్లో తిరిగి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య తెలిపారు.

ఉచితంగా సహాయ ఉపకరణాలు

మహబూబాబాద్: మహిళా శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి శారీరక వైకల్యం, అంధులకు, మానసిక దివ్యాంగులకు సహాయ ఉపకరణములను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు జిల్లా సంక్షేమాధికారి ధనమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెబ్‌సైట్‌లో 7వ తేదీ నుంచి 18వ తేదీలోపు సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం 89786 98912 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఘనంగా ఉర్సు



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లి గ్రామంలో గల హజ్రత్ సయ్యద్ ఇమామ్ షావలి దర్గా ఉర్సు ఉత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీనాయక్, డాక్టర్ ఉమ దంపతులు, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి హజ్రత్ సయ్యద్ ఇమామ్ షావలి దర్గాను సందర్శించి మొక్కులు సమర్పించారు. కార్యక్రమంలో దూపటి వినయ్, శ్రీరాం నాగన్న, రాపాక రాజశేఖర్, ధరావత్ చంద్య, చెడిపాక వెంకటేష్, ప్రభాకర్, రాజు, నరేష్, రాము, వినయ్, తదితరులు పాల్గొన్నారు

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య


నెల్లికుదురు: ఇనుగుర్తి మండలం లక్ష్మీపురంలో బడిబాట నిర్వహిస్తున్న హెచ్ఎం చైతన్య

సాక్షి నెట్‌వర్క్: ప్రభుత్వ బడిలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఉపాధ్యాయులు తెలిపారు. సోమవారం ప్రభుత్వ ఉపాధ్యాయులు గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ బడిబాట నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించడంతోపాటు పాఠ్యపుస్తకాలు, రెండు జతల యూనిఫాం, మధ్యాహ్న భోజనం, రాగి జావ ఇస్తున్నట్లు పిల్లల తల్లిదండ్రులకు తెలిపారు.

గంగమ్మ జాతర



చిన్నగూడూరు: మండలంలోని జయ్యారం గ్రామంలో గంగమ్మ ఆలయంలో యాదవ కులస్తులు సోమవారం గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు.

మహబూబాబాద్ రూరల్: మండలంలోని మల్యాల గ్రామంలో గంగమ్మ తల్లి జాతర సోమవారం కనుల పండువగా జరిగాయి. ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

ఇందిరమ్మ ఇళ్లతో పేదల కల సాకారం


కురవి: ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

కురవి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పేదల కల సాకారం అయిందని మరిపెడ ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు నారాయణ రాజేందర్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గత పదేళ్ల కాలంలో పేదలకు ఇళ్లు రాక నానా అవస్థలు పడ్డారని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి, ఆలయ ధర్మకర్త బాలగాని శ్రీనివాస్, సీపీఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎర్ర నాగేశ్వర్‌రావు, కామిండ్ల వీరన్న, తరాల కళావతి, నాయకులు అవిరె మోహన్‌రావు, నాయకులు బాదె వీరభద్రం, వద్దుల ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కేసముద్రం: మండలంలోని ఇంటికన్నె గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజులపాటి మల్లయ్య, మాజీ సర్పంచ్ ఐతే సారయ్య సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గాదె గౌతమి, శ్రీనివాస్, వర్దెల్లి సుమలత, నిమ్మనగోటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మరిపెడ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేర్చిందని పార్టీ జిల్లా నాయకుడు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అబ్బాయిపాలెం గ్రామంలో పలువురు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ముగ్గు పోసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీలక్ష్మీ, జిన్నా లచ్చయ్య, కారోబార్ యాదగిరి పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాడాలి

నెహ్రూసెంటర్: బిర్సాముండా పోరాట స్ఫూర్తితో ఆదివాసీ హక్కుల కోసం పోరాడాలని గిరిజన సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ కిషన్ నాయక్ అన్నారు. సోమవారం బిర్సాముండా వర్ధంతిని దళిత, గిరిజన, ప్రజాసంఘాలు, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రవి, దేవేందర్, హరినాయక్, బీమానాయక్, రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పల్టీకొట్టిన కారు.. తప్పిన ప్రమాదం

గూడూరు: మండలంలోని బొద్దుగొండ సమీపంలో నిర్మాణ పనులు నిలిచిన జాతీయ రహదారి ప్రదేశం. అక్కడ ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. సోమవారం మానుకోట మీదుగా వచ్చిన ఓ కారు ఎన్‌హెచ్‌పై వేగంగా వచ్చి, రోడ్డుపై గుంతలో పడి కారు పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు యజమానికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

దంతాలపల్లిలో..

దంతాలపల్లి: మండలకేంద్రంలో రోడ్డుపై ఉన్న గుంత ప్రయాణికుల పాలిట యమపాశంగా మారింది. నర్సింహులపేట మండలం వంతడపల గ్రామానికి చెందిన పాశం శ్రీకాంత్ తన స్నేతుడితో సొంత పనిపై తన కారులో హైదరాబాద్ వెళ్లి వస్తున్నాడు. రోడ్డుపై ఉన్న గుంతను చూసిన శ్రీకాంత్ బ్రేక్ వేయడంతో కారు అదుపు తప్పి పల్టీకొట్టింది. కారులో ఉన్న వారికి ప్రమాదం తప్పింది.

కబ్జా స్థలంలో పాఠశాల నిర్మాణం


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న సంఘం నాయకులు

మహబూబాబాద్: డాక్టర్ ప్రమోద్‌రెడ్డి కబ్జా చేసిన స్థలంలోనే ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నిర్మాణం చేశారని, పాఠశాల పర్మిషన్ రద్దు చేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్ డిమాండ్ చేశాడు. ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని వీరారం తండాకు చెందిన పలువురు గిరిజన కుటుంబాలు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేసి అనంతరం అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మచారికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. పిల్లల తల్లిదండ్రుల నుంచి లక్షల్లో ఫీజులు వసూళ్లు చేసే కుట్రలు చేస్తున్నారని, సంబంధిత అధికారులు విచారణ చేసి చర్య తీసుకోవాలని డిమాండ్ చేశాడు. డాక్టర్ ప్రమోద్‌రెడ్డిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలన్నారు. 30ఎకరాల గిరిజన భూములను ప్రమోద్ రెడ్డి తన అనుచరులు పోర్జరీ సంతకాలతో కబ్జా చేశారన్నారు. కార్యక్రమంలో భూక్య శ్రీను, బాలాజీ, లాల్ సింగ్, రవీందర్, మల్సూర్, భిక్షం, కిరణ్ పాల్గొన్నారు.

'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' అమలు చేయాలి


ధర్నా చేస్తున్న నాయకులు

బయ్యారం: ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వెంటనే అమలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం(ఏఐపీకేఎంఎస్) ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు బిల్లాకంటి సూర్యం మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి 18నెలలు కావస్తున్నా ఆత్మీయ భరోసా అమలుకు నోచుకోవడంలేదని విమర్శించారు. ఉపాధి పని 20రోజులు ఉండాలనే నిబంధన పెట్టి వ్యవసాయ కూలీలకు రావాల్సిన భరోసా రాకుండా అడ్డుకునే యత్నం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్యం, యాకయ్య, లచ్చయ్య, ధనంజయ, వెంకన్న, జానీ, తిరుపతిరెడ్డి, మహేష్, సోమిరెడ్డి పాల్గొన్నారు.

గ్రానైట్ రాయి కేబిన్‌పై పడి డ్రైవర్ మృతి


లారీ కేబిన్‌పై పడిన గ్రానైట్ రాయిని క్రేన్ సహాయంతో తొలగిస్తున్న పోలీసులు

తొర్రూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో గ్రానైట్ లారీ డ్రైవర్ దుర్మరణం పాలైన ఘటన సోమవారం మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల మేరకు.. రంగారెడ్డి జిల్లా ముచ్చెర్ల గ్రామానికి చెందిన దేరుంగుల బాలరాజు (52) గ్రానైట్ లారీ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా కరీంనగర్ నుంచి కాకినాడకు గ్రానైట్ లోడ్‌ను లారీలో తరలిస్తున్న క్రమంలో మండలంలోని ఫత్తేపురంలోని జాతీయ రహదారిపై ప్రమాదం చోటుచేసుకుంది. ధాన్యం బస్తాల లోడుతో ముందు వెళ్తున్న సివిల్ సప్లయి లారీ ఎటువంటి సిగ్నల్ ఇవ్వకుండా బ్రేక్ వేయగా.. దాని వెనక వస్తున్న గ్రానైట్ లోడ్ లారీ బ్రేక్ వేయడంతో లారీలో ఉన్న భారీ గ్రానైట్ రాయి ముందుకు జారీ డ్రైవర్ కేబిన్‌పై పడింది. దీంతో కేబిన్ నుజ్జునుజ్జు అయి దానిలోని డ్రైవర్ బాలరాజు అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ఘటనా స్థలికి పోలీసులు చేరుకుని నాలుగు గంటల పాటు శ్రమించి క్రేన్ సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రానికి తరలించారు. మృతుడికి భార్య అంజమ్మ, కుమారుడు శివలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్..

రైలు నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

కేసముద్రం: రైల్లో నుంచి ఓ గుర్తుతెలియని వ్యక్తి జారిపడి మృతి చెందిన సంఘటన మండలంలోని ఇంటికన్నె-కేసముద్రంస్టేషన్ రైల్వేస్టేషన్‌ల మధ్య సోమవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట నుంచి మహబూబాబాద్ వైపునకు డౌన్‌లైన్‌లో వెళ్తున్న రైల్లో ప్రయాణిస్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి ఉదయం 7గంటల సమయంలో ఫుట్‌డోర్‌లో నుంచి ప్రమాదవశాత్తు జారి కిందపడి మృతి చెందాడు. మృతుడి వయస్సు 40-45 సంవత్సరాలు, 5.5 ఎత్తు ఉన్నట్లు తెలిపారు. చనిపోయిన వ్యక్తి వద్ద దానాపూర్ టూ పెరంబుర్ వరకు గల రైల్వే వెయిటింగ్ లిస్ట్ టికెట్ ఉన్నట్లు తెలిపారు. వరంగల్ ఎంజీఎం మార్చురీగదిలో మృతదేహాన్ని భద్రపరిచినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ రవీందర్ పేర్కొన్నారు.

ఇద్దరిపై అట్రాసిటి కేసు నమోదు

కొత్తగూడ: మద్యం మత్తులో ఆదివాసీ మహిళపై దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్సై కుశ కుమార్ తెలిపారు. ఎంచగూడెం గ్రామానికి చెందిన తరాల అనిల్, మహబూబాద్ మండలం రెడ్యాల గ్రామానికి చెందిన ఒగ్గు దేవెందర్ ఇద్దరు మద్యం తాగేందుకు సాదిరెడ్డిపల్లి గ్రామంలోని ఆదివాసీ మహిళకు సంబంధించిన కిరాణ షాపునకు వెళ్లి మద్యం మత్తులో గొడవపడి కొట్టారు. దీంతో మహిళకు తీవ్ర రక్తస్రావం అయింది. మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కాపర్ వైరు చోరీ.. కేసు నమోదు

నెల్లికుదురు: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైరు దొంగిలించిన నలుగురుతోపాటు కొనుగోలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని రావిరాల శివారుతో పాటు చుట్టు పక్కల నర్సింహులపేట, తొర్రూరు, సిరోలు, మరిపెడ, మహబూబాబాద్ మండలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల కాపర్ వైరు దొంగిలించి సొమ్ము చేసుకుంటున్న భద్రాద్రికొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక కాలనీకి చెందిన బెల్లంకొండ సమ్మయ్య తన స్నేహితులైన శివ, కార్తీక్, వెంకట్‌లతో కలిసి దొంగతనాలకు పాల్పడే వారన్నారు. దొంగిలించిన కాపర్ వైరును అద్దంకి రాములుకు విక్రయించే వారని తెలిపారు. ఐదుగురుపై కేసు నమోదు చేసి ఏ1 బెల్లంకొండ సమ్మయ్యను రిమాండ్‌కు తరలించామని నలుగురు పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

సంక్షిప్త సమాచారం

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

తొర్రూరు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొరివి సుధాకరాచారి తెలిపారు. ఎస్‌టీయూ ఆవిర్భావ వేడుకలు సోమవారం డివిజన్ కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమంలో యాకూబ్‌రెడ్డి, చంద్రప్రకాష్, చంద్రమౌళి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాలమహానాడు మండల సెక్రటరీగా చంద్రమోహన్

దోర్నకల్: మాలమహానాడు మండల సెక్రటరీగా డోర్నకల్‌కు చెందిన బత్తుల చంద్రశేఖర్ నియమితులయ్యారు. చంద్రశేఖర్‌ను మండల సెక్రెటరీగా నియమిస్తున్నట్లు సంఘం మండల అధ్యక్షుడు పగిడిపల్లి నాగేశ్వర్‌రావు సోమవారం ప్రకటించారు.

వైద్యశిబిరం

గార్ల: క్షయవ్యాధిని నివారించేందుకు వైద్యుల సూచనల ప్రకారం క్రమం తప్పకుండా మందులు వాడాలని పీహెచ్‌సీ డాక్టర్ శివకుమార్ సూచించారు. సోమవారం మండలంలోని రాంపురం, పోచారం గ్రామాల్లో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో హెచ్‌ఈఓ శ్రీహరి, హెచ్‌ఎస్ ఇస్మాయిల్ బేగ్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

పెద్దవంగర: మండలంలోని చిన్నవంగర గ్రామానికి చెందిన వల్లపు అశోక్ (45) ప్రమాదవశాత్తు మృతి చెందాడు. సోమవారం మాజీ ఎంపీటీసీ మెట్టు సౌజన్య నగేష్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.10వేల ఆర్థికసాయం చేశాడు.

తొర్రూరు రూరల్: మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన రమేష్ ఇటీవల మృతి చెందగా 1996-97 ఎస్సెస్సీ బ్యాచ్ మిత్రులు సోమవారం రూ.30వేల ఆర్థిక సాయమందించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

చిన్నగూడూరు: నకిలీ విత్తనాలను నిర్వాహకులు రైతులకు అంటగడితే చర్యలు తప్పవని వ్యవసాయ అధికారి భాస్కర్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని చిన్నగూడూరు, జయ్యారం గ్రామాలలో ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ షాపులను తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

యూనిఫాం పంపిణీ

దోర్నకల్: మండలంలోని అమ్మపాలెం ప్రభుత్వ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు స్కూల్ యూనిఫాంతోపాటు టై, బెల్టులు ఎంఈఓ ఆంగోత్ లక్ష్మానాయక్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం బండి నర్సింహరావు పంపిణీ చేశారు. హెచ్‌ఎం వి.శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు వీరన్న, శోభారాణి, త్రివేణి, శిరీష పాల్గొన్నారు.

సెల్ టవర్ ఏర్పాటు కోసం వినతి

గూడూరు: దట్టమైన అడవిలో మారుమూల ఏజెన్సీ గ్రామాలైన మట్టెవాడ, నేలవంచ, ఊట్ల గ్రామాలకు బీఎస్‌ఎన్‌ఎల్ టవర్ ఏర్పాటు చేయించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి చెల్పూరు వెంకన్న, జాతీయ ఎస్టీ కమిషన్ నాయకుడు రాంబాబు కోరారు. మండలంలోని మచ్చర్ల శివారు ఎన్‌హెచ్ పక్కన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్ గృహంలో సోమవారం వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు నాయిని ధర్మారెడ్డి, సోమూనాయక్, మదన్ నాయక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆక్రమించుకున్న భూములను తీసుకోవాలి

నెల్లికుదురు: దళారులు అక్రమంగా ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములను ప్రభుత్వం గుర్తించి వెనక్కి తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ఇస్సంపల్లి సైదులు ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని మునిగలవీడు గ్రామంలో నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ చందా నరేష్‌కు వినతి పత్రం అందించారు.

నమ్మాళ్వార్ తిరునక్షత్ర ఉత్సవం

మహబూబాబాద్ రూరల్: శ్రీవైష్ణవ సంప్రదాయ ఉద్ధరణ పూజ్యులు నమ్మాళ్వార్ తిరునక్షత్ర (జన్మదిన) ఉత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి వారి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు.

ఆక్రమణకు గురైన శిఖం భూమి

గార్ల: గార్ల పెద్దచెరువులో ఆక్రమణకు గురైన శిఖం భూమిని వెలికి తీయాలని సీపీఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న సంబంధిత అధికారులను డిమాండ్ చేశాడు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మాగం లోకేష్ పాల్గొన్నారు.

రైతుకు పాముకాటు

దోర్నకల్: మండలంలోని చాప్లాతండాకు చెందిన అజ్మీర హట్యా పొలంవద్ద పనులు చేస్తుండగా పాముకాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే స్పందించిన కుటుంబ సభ్యులు డోర్నకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

మాజీ ఎంపీని కలిసిన డిప్యూటీ స్పీకర్

మరిపెడ రూరల్: మాజీ పార్లమెంట్ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ కురవృద్ధుడు రామసహాయం సురేందర్‌రెడ్డిని డిప్యూటీ స్పీకర్‌గా నియామకమైన జాటోతు రాంచంద్రునాయక్-ప్రమీల దంపతులు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

పెద్దవంగర: సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఎంపీడీఓ వేణుమాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీజనల్ వాధ్యులపై అనుసరించాల్సిన వాటిపై ప్రణాళికలను సిద్ధం చేశామని తెలిపారు. ఆరోగ్య సమస్యలు వంటి వివరాల కోసం 99597 20850 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన బోధన

గూడూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాణ్యమైన విద్యా బోధన అందిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పరశురాములు అన్నారు. మండల కేంద్రంతోపాటు అయోధ్యపురం, నాయకపల్లి గ్రామాలలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మహేందర్, బాబు, అరవింద్, రమేష్, కృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

టాటా ఏస్ ఢీకొని ఒకరికి గాయాలు

పెద్దవంగర: మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి అవుతాపురం గ్రామానికి టాటా ఏస్ వాహనాన్ని నడుపుకొంటూ వెళ్తున్నాడు. ఉప్పరగూడెం గ్రామానికి చెందిన శాస్త్రబోయిన యాకయ్య సోమవారం తన పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై అవుతాపురం గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో ఉప్పరగూడెం శివారులో ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నాయి. ఈప్రమాదంలో యాకయ్యకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం వరంగల్ తరలించారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

గూడూరు: ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సులో రైతులు తమ భూ సమస్య పరిష్కారానికై దరఖాస్తు చేసుకోవాలని ఎస్సై గిరిధర్‌రెడ్డి అన్నారు. గూడూరు శివారు వడ్డెరగూడెం రైతు వేదికతో పాటు తీగలవేణి లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. గూడూరు సదస్సులో 138, తీగలవేణిలో 31 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ నాగభవాని, డీటీ కోమల తెలిపారు.

చిన్నగూడూరు: చిన్నగూడూరు గ్రామపంచాయతీ ఆవరణలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మహబూబ్ అలీ పాల్గొని గ్రామస్తుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

కురవి: మండలంలోని అయ్యగారిపల్లి, నల్లెల్ల గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు సోమవారం జరిగాయి. రైతులు తమ సమస్యలను దరఖాస్తుల రూపంలో అధికారులకు అందించారు. రెవెన్యూ సదస్సులు ప్రశాంతంగా జరిగాయి. సదస్సుల్లో పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

విద్యార్థికి సన్మానం

కేసముద్రం: మండలంలోని పెనుగొండ గ్రామ జెడ్పీహైస్కూల్‌లో గూడూరు మండలం అప్పరాజుపల్లికి చెందిన యశ్వంత్‌సాయి పది వార్షిక పరీక్షల్లో 549 మార్కులు సాధించాడు. సోమవారం ఎంఈఓ కాలేరు యాదగిరి, ఉపాధ్యాయ బృందం సన్మానించారు.

సకాలంలో విత్తనాలు అందించాలి

నెల్లికుదురు: రైతులకు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించాలని ఏఐకేఎంఎస్ తొర్రూరుడివిజన్ కార్యదర్శి ఇరుగు నాగన్న, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ డివిజన్ నాయకుడు ఇరుగు అనిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు.

రోడ్డుకు మరమ్మతులు

మరిపెడ రూరల్: గత ఏడాది ఆగస్టు నెలలో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని ఆకేరు వాగు ఉధృతికి పురుషోత్తమాయగూడెం బ్రిడ్జి వద్ద 365 నేషనల్ హైవే తెగి కొట్టుకొని పోయింది. దీంతో తాత్కాలికంగా మట్టి పోసినప్పటికి ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. అందుకు స్పందించిన అధికారులు నేషనల్ హైవే నిర్మాణ పనులు చేపట్టి బ్లాక్ టాప్ నిర్మించారు. దీంతో వాహనదారులు సురక్షితంగా ప్రయాణాలు కొనసాగిస్తున్నారు.